# సుకారీ, లంబాడీ, మరాటీ

"సుకారీ, లంబాడీ, మరాటీ" ఈ తెగల్లో ఏ తెగవాళ్ళు వీళ్ళని చూస్తున్నాను—గుంపుగా కొందఱు గోదావరివంచే దిగి అవతలవొడ్డునున్న కొవ్వూరుకు పడవల మీాద చేరుకుందామనుకుంటూ కాసర బీసరగా మాటలాడుకునే జనుల్ని చూచి. వాళ్ల తాలూకు వంద వందఏభై గాడిదలు గూడులేని పెద్దతొట్టిపడవలో కెక్కి నిలుచుండాయి ఓ గూడున్న తొట్టిపడవమీాద అటూఇటూ పదిపదిహేను బళ్ళు చక్రాలూడగొట్టినవి కొన్నీ, కాడి లాగివేసినవి కొన్నీ, చక్రాలు కుదేసినవికొన్నీ నదిదాటే విధంగా అమరింపు సూచిస్తున్నాయి. గూటిగుండా సామాను తొంగిచూస్తూవుంది. మనుష్యులుమాత్రం ఇంకా వొడ్డుపైనే వండుకొంటూ కొందఱు, వండుకొని కొందఱు, ఆడుకొంటూ కొందఱు, పాడుకొంటూ కొందఱు చెలరేగుతూ వున్నారు.

"మరాటీగుంపు" అన్నాడు గట్టేనడచిపొయ్యే పాంథుడు, "వాళ్ళదగ్గఱ డబ్బు నిలవవుంటుంది. కాని అది వాళ్ళదగ్గఱ వుంచుకోడానికి వీల్లేదు. ఏసాయంత్రాని కాసాయంత్రం వాళ్ళను గాపలా గాచే రక్షకభటులికి అప్పజెప్పివేయవలసినదే—అదుగో రక్షకభటులు అని అక్కడే కూర్చుని దిగాల్ మొగంగావున్న పోలీసుల్ని చూపించేడు.

నేనారక్షకభటుల్ని చూస్తూ "అయితే యీాతండావాళ్ళకి స్వేచ్ఛలేదు, ఆజన్మాన్ని ఎప్పుడూ ఈరక్షకభటులు ఎప్పుడూ కావలి కాస్తూ ఇటూఅటూ పోనివ్వరు, నేనింకా సుకారీ, లంబాడీ, మరాటీ అంటే స్వేచ్ఛాజీవనానికి ప్రతిబింబా లనుకుంటూండేవాణ్ణి." అంటూ మిక్కిలి జాలిగా గుంపుకేసి చూడసాగినాను.

అప్పుడింకా పాంథుడన్నాడు "అంత ఇది కాదులెండి. పగలు వాళ్ళిష్టమువచ్చినట్టూ తిరిగి ఊళ్లోయిళ్ళదగ్గిఱా కొట్లదగ్గిఱా దండోరాచేసి వాళ్లతవ్వెడుబియ్యం డబ్బా పట్టుకుపోవచ్చును. సాయంకాలానికి మాత్రం హాజరుపట్టీయిచ్చి పోలీసుహావేళీలో వుండాలి" అన్నాడు.

"వీళ్ళకు ఇల్లులేవు. వాకిళ్లులేవు. పగలల్లా తిరుగుతూవుంటారు. రాత్రిళ్ళు పోలీసు కాపలా. అటువంటి పరిస్థితిలో వీళ్ళకుటుంబా లింతవృద్ధికావడం, వీళ్ళకు పసిపాపలు నవ్వుకలిగిస్తూవుండడం, యువతులు గర్భిణీ స్త్రీలై గౌరవనీయంగా కనబడ్డం ఇదంతా ఎక్కడంటావు - ఎప్పుడంటావు - ఆశ్చర్యం కాలేదోయి నీకు?" అన్నానుపాంథునితో

పాంథుడు అన్నాడు "వెన్నెలే వాళ్లకు దుప్పటి, చీకటే వాళ్లకు బూర్నీసు-అనుకుంటాను" అన్నాడు పాంథుడు - అంటూ వెళ్లిపోయేడు చిరునవ్వునవ్వుతూ—

ఒక చిన్నకుఱ్ఱవాడు ఆదండులోంచి విడువడి గబుక్కున పాంథుని కడ్డుతగిలి తన కడుపు దీనంగా కొట్టుకొంటూ డబ్బుకావాలన్నట్టు సంజ్ఞచేసినాడు. వానిమొగం మంచి అందంగావుంది. జనపాలువున్నాయి. కళ్లల్లో తేజస్సు ఒలికిపోతూంది. ఒళ్లంతా కాసువన్నె పోతవిగ్రహంలాగ గనిపిస్తూంది. వాడలాదీనాలాపం ఆడుతూన్నాడు. సంధ్యకాంతి కేసి చూస్తూ తెప్పలాడిస్తూన్నాడు వినోదంగా.

“ఈబుడుతడి తల్లీ, దండ్రీ ఎవరో!” అని అనుకొన్నాను. రక్షకభటుల్లో ఒకడికి ఆనా అనుకోవడం వినబడినట్టుగావుంది. అతగాడు అన్నాడు “వాళ్లకు తండ్రి ఆకాశం, తల్లి భూలోకం, జగత్తంతావాడే” నన్నాడు.

ఆలా అతగాడన్నాడు. కుఱ్ఱాడో డబ్బు పాంథుడిదగ్గఱ పుచ్చుకున్నాడు. శ్రద్ధానంద ఘాటుమెట్లమీద ఇడ్డెనలమ్మే బ్రాహ్మడి దగ్గఱ ఓఇడ్డెన్న కొనుక్కున్నాడు. తిన్నాడు. వెంటనే మఱోడిదగ్గఱకు పఱుగెత్తుకెళ్లిమళ్లీ దీనంగా కడుపుకొట్టుకుంటూ మళ్లీ సంధ్యకాంతి కేసి చూస్తున్నాడు.—రక్షకభటుడు “చూడండి అప్పుడే ఆకుఱ్ఱాడు ఎన్నిపోకిళ్లు పోయాడో” అన్నాడు—నేను ఆకుఱ్ఱవాని కేసి చూస్తున్నాను. వాడో అరటిపళ్ల దుకాణాదారు దగ్గఱకు వెళ్లి డబ్బివ్వకుండానే ఒక అరటిపండు గెల్లోంచి లాక్కున్నాడు. తింటూ పరుగెత్తుకు పోయిపోయి గుభాల్న గోదావరిలోపడి ఈతాలాడ్డం ప్రారంభించేడు. ఈతాలాడి వొడ్డుకెక్కి వళ్లుతుడుచుకోకుండానే ఓచిన్న పొట్టి నులకమంచం అక్కడవాల్చినదానిపైని దొర్లేడు. “వాళ్లకు తండ్రి ఆకాశం, తల్లి భూలోకం” అని రక్షకభటుడన్నమాట మళ్లీతట్టింది. వానికళ్లల్లో సంధ్యకాంతి తాండవిస్తూంది—నేను పరకాయిస్తున్నాను.

నాతోమాట్లాడిన రక్షకభటుని బీటు అయిపోయి అతడు గట్టెక్కిపోతూ నన్ను “ఏమిటి ఆలాపరకాయిస్తున్నారు” అన్నాడు. “ఏమీ లేదు. నీవన్నముక్కే ఆలోచిస్తున్నాను. ఆకాశంతండ్రి అంటే ఏమిటూ, భూలోకంతల్లి అంటే ఏమిటూ” అని అన్నాను. రక్షకభటుండు అన్నాడు “బాబూ! మేము ఏక్షణంవాళ్లను కాచుకూర్చుకుంటూ వుంటాము. ఆడదానిమీద ఆకాశం మగాడి క్రింద భూలోకం తప్ప మఱేమీ వుండడానికి వీల్లేదు. వాళ్లకు బిడ్డలుకలిగేరు అంటే ఏమనుకోము? ఆకాశం తండ్రి భూలోకం తల్లి అనుకుంటాము” అన్నాడు. “అంతబాగా కనిపెట్టేవాళ్లు కామట్టే మిమ్మల్ని రక్షకభటు”లన్నారు అని వానితో సామాన్యంగా ఆడేసి వాణ్ణిపంపివేసి నేనూ ఇంటికి వెళ్లిపోయినాను.

మళ్లీ ఆతెగవాళ్ల పుట్టుపూర్వోత్తరం యోజించసాగినాను. “ఆకాశం తండ్రి, భూలోకం తల్లీ ఆరెండుకలిసేచోటున వాళ్లు ఉద్భవిల్లుతూ ఒకటేనడక ఒకటేనడక ఆ సూర్యచంద్రుల్లాగు ఒకటేనడక నడస్తూపోతారు. వాళ్లకేమిటి స్వేచ్ఛ : వాళ్లప్రేమ చెట్టునీడ, నదీతీరాన్ని, వెన్నెట్లోను, చీకట్లోను విరిసి నృత్యచేస్తూవుంటుంది వాళ్లనొకళ్లు కనిపెట్టడానికి శక్యమా? పదివేలమంది రక్షకటులున్నాగానీ రక్షకభటులు లేనివాళ్లే” అని అలాఅనుకుంటూ స్వేచ్ఛగా నిద్రపోయినాను. నిద్రలో స్వేచ్ఛగా కలగన్నాను. నిద్రే రక్షకభటుడు. స్వేచ్ఛగాగన్న నాకలే “సుకాళీ, లంబాడీ, మరాటీ”—

—కవికొండల వేంకటరావు, బి.ఏ., బి.ఎల్.


## ఆంధ్రభూమి

సచిత్రాంధ్రమాసపత్రిక.

ప్రతిమాసమున ౨౫-వ తేదిని ప్రచురింపబడును.

చందా వివరము.

| | | |
|---|---|---|
| సంవత్సరమునకు | .. | రు. ౩-౦-౦. |
| అర్ధసంవత్సరమునకు | ... | రు. ౧-౮-౦. |
| నాలుగు మాసములకు | ... | రు. ౧-౦-౦. |
| విడిసంచిక | ... | రు. ౦-౪-౦. |